క్లుప్తంగా

రూ.61.37లక్షల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీ సింహాచలంకు చెక్కులను అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ అధికారులు ఆస్తి పన్ను వసూలును వేగవంతం చేశారు. అందులో భాగంగా శుక్రవారం ఒక్క రోజే 64,65,86,68 వార్డుల్లోని శ్రావణ్ షిప్పింగ్ కార్పొరేషన్, వైజాగ్ ప్రొఫైల్స్ నుంచి రూ.61,37,269 ఆస్తి పన్నులను వసూలు చేశారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కులను రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్ తమ ఆర్ఐలు కె.శివ, రెడ్డి మోహన్, సుభాన్‌లతో కలిసి గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్సీ వారిని అభినందించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

పెదగంట్యాడ: 75వ వార్డు మొల్లివానిపాలెంలో కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి శుక్రవారం పరిశీలించారు. నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాల నుంచి నడుపూరు జెడ్పీ హైస్కూల్ వరకు రూ.20లక్షలతో ఈ పనులు చేపట్టారు.

ఉక్కు అధికారికి ఎంబీఏలో గోల్డ్ మెడల్



గోపాల్‌కు గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్న యూజీసీ చైర్మన్ జగదీష్ కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం సీనియర్ మేనేజర్ ఎం.గోపాల్‌కు ఎంబీఏలో గోల్డ్ మెడల్ లభించింది. ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తూ గోపాల్ దూరవిద్య ద్వారా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో మార్కెటింగ్ విభాగంలో ఎంబీఏ చేశారు. ఆ పరీక్షల్లో గోపాల్ అత్యధిక మార్కులు సాధించడంతో ఆయనకు గోల్డ్ మెడల్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన 25వ స్నాతకోత్సవంలో ఆయనకు యూజీసీ చైర్మన్ ఎం.జగదీష్ కుమార్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అమానుషం



దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు విషయంలో కార్మికులను రోడ్డున పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమానుషమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 1051వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

పాల సొసైటీ అధ్యక్షుడికి సత్కారం

అగనంపూడి: విశాఖ డెయిరీ అనుబంధంగా ఉన్న నంగినారపాడు పాల సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఇ.వెంకటరమణను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు ఎం.వి.రమణ, బి.సత్యనారాయణ, కె.హనుమంతురావు, బి.అప్పారావు, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు.. తీరిన వెతలు

- కొండపైకి మార్గం సుగమం
- రూ.95 లక్షలతో మెట్ల నిర్మాణం
- 30 ఏళ్ల కష్టాలు తీరిన తరుణం
- మూడు కాలనీల్లో నివాసితుల హర్షం

నాడు 65వ వార్డు సంజీవ కాలనీ, భానోజీ కాలనీ, కాకతీయలోవ కాలనీలకు వెళ్లాలంటే సరైన మార్గం లేక ప్రజలు చాలా ఇబ్బంది పడేవారు. ఈ కాలనీల్లో ఎక్కువ శాతం కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారే. పగలంతా కాయకష్టం చేసుకుని, సాయంత్రం ఇంటికి వెళ్లాలంటే ఎన్నో అవస్థలు ఎదుర్కోవలసి వచ్చేది. వర్షం పడితే వారి కష్టం దేవుడికే తెలియాలి. గత చంద్రబాబు ప్రభుత్వం కొండవాలు ప్రాంతాల వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.

నేడు జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏళ్ల నాటి కొండవాలు ప్రాంతాల సమస్యకు పరిష్కారం లభించింది. స్థానిక కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు చొరవతో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృషితో కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధికి జీవీఎంసీ నుంచి రూ.95 లక్షలు రూపాయలు మంజూరయ్యాయి. కాలనీల వారీగా నిధులు వెచ్చించి మెట్ల మార్గాలను ఆధునీకీకరించారు. దీంతో రాకపోకలకు మార్గం సుగమం అయింది.

పెదగంట్యాడ:
జీవీఎంసీ 65వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో రాకపోకలకు సుమారు 30 ఏళ్లుగా ప్రజలు పడుతున్న కష్టాలకు తెర పడింది.

మూడు కాలనీలకు రూ.95 లక్షలతో మెట్ల ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. దీంతో సంజీవ కాలనీ, భానోజీ కాలనీ, కాకతీయలోవ కాలనీల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భానోజీ కాలనీ మెట్ల మార్గం అభివృద్ధి

65వ వార్డు కొండవాలుపై ఉన్న భానోజీ కాలనీకి 30 ఏళ్లుగా మెట్లు లేక ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో సుమారు 4 వేల మంది జనాభా నివసిస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. రూ.35 లక్షల నిధులతో మెట్ల మార్గం అభివృద్ధి చేసి భానోజీ కాలనీ ప్రజల కష్టాలు తీర్చారు.

సాఫీగా సంజీవ కాలనీకి..

కొండవాలు ప్రాంతమైన సంజీవ కాలనీ మెట్ల మార్గం అధ్వానంగా తయారవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడువారు. ఈ క్రమంలో రూ.19.50 లక్షలతో మెట్ల మార్గం నిర్మించారు. ప్రస్తుతం రాకపోకలు సాఫీగా సాగిపోతున్నాయి.

కాకతీయలోవకు చకచకా..

కాకతీయలోవలో మెట్ల మార్గం శిథిలం కావడంతో ఈ మార్గంలో నడవలేక వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడేవారు. ఈ క్రమంలో రూ. 40.50 లక్షలతో మెట్ల మార్గం, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



భానోజీ కాలనీలో అధ్వానంగా ఉన్న మెట్ల మార్గం



భానోజీ కాలనీలోని కొండపైకి నిర్మించిన మెట్ల మార్గం

భానోజీ కాలనీ	రూ.35 లక్షలు
సంజీవ కాలనీ	రూ.19.50 లక్షలు
కాకతీయలోవ	రూ. 40.50 లక్షలు



సంజీవ కాలనీలో అధ్వానంగా మార్గం



సంజీవకాలనీలో కొత్తగా నిర్మించిన రోడ్డు

30 ఏళ్ల కష్టం తీర్చారు



కొండపైకి సరైన మార్గం లేక 30 ఏళ్లుగా చాలా ఇబ్బంది పడ్డాం. గత ప్రభుత్వంలో నాయకులకు ఎన్నో వినతులిచ్చాం. కానీ ఫలితం లేకపోయింది. ఇప్పుడు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు స్వయంగా వచ్చి ఇక్కడ పరిస్థితి పరిశీలించి నిధులు మంజూరు చేయించారు. మెట్లు నిర్మించారు, రోడ్డు వేశారు. మా కష్టాలు తీరాయి.

– కె త్రినాథ్, భానోజీ కాలనీ

చీకటి పడితే భయం వేసేది



మెట్ల మార్గం సక్రమంగా లేక చీకటి పడితే జారిపోతామేమో అని భయం వేసేది. తాగునీటి కోసం బయటకు వెళ్లి రావాలన్నా అవస్థలే. ఎట్టకేలకు మా ఇబ్బందులు గట్టెక్కే సమయం వచ్చింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేగారికి వినతి పత్రం అందించాం. ఆయన స్పందించి చర్యలు తీసుకోవడంతో మెట్ల మార్గం నిర్మించారు.

– కొయిడాల దేవి, సంజీవ కాలనీ, 65వ వార్డు

దశాబ్దాల సమస్య తీరింది



కాకతీయలోవలో 30ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. మెట్లు శిథిలం కావడంతో వర్షం పడితే చాలు బురదమమయ్యేవి. రాకపోకలకు కష్టమయ్యేది. ఎక్కడ జారిపోతామో అని భయపడేవాళ్లం. ఇప్పుడిక ఆ భయం లేదు. చక్కగా మెట్లు, రోడ్లు నిర్మించారు. దశాబ్దాల నాటి సమస్య పరిష్కరించారు.

– మర్రిపు అప్పలనర్సమ్మ, అమరపు గోపాలమ్మ, కాకతీయ లోవ

సమస్య పరిష్కారంతో సంతృప్తి



వార్డులోని కొండవాలు ప్రాంతాల ప్రజలు కొండ పైకి సరైన దారి లేక ఇబ్బంది పడేవారు. సమస్యను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన కూడా కొండవాలు ప్రాంతాల్లో పర్యటించారు.వారి ఇబ్బందులు తొలగించాలి అనుకున్నాం. వెంటనే నిధులు మంజూరు చేయించి, మెట్లు, రోడ్డు మార్గాలు నిర్మించాం. దీర్ఘకాలిక సమస్య పరిష్కరించామని సంతృప్తి కలిగింది.

– బొడ్డు నరసింహపాత్రుడు, 65వ వార్డు కార్పొరేటర్

హయ్యర్ పెన్షన్‌కు బీఎంఎస్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ పిఎఫ్ ట్రస్టీ మల్లేశం

ఉక్కునగరం: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా హయ్యర్ పెన్షన్ వచ్చే విధంగా బీఎంఎస్ కృషి చేస్తోందని సెంట్రల్ ఈపీఎఫ్ ట్రస్టీ సుంకరి మల్లేశం తెలిపారు. స్టీల్ బీఎంఎస్ కార్యాలయంలో ఈపీఎస్–95 మీద ఉద్యోగులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగులు, పెన్షన్‌దారుల సందేహాలను నివృత్తి చేశారు. 2014 తర్వాత అర్హత పొందిన దరఖాస్తుదారులకు ఎవరికీ ఇంతవరకు హయ్యర్ పెన్షన్ ఆర్డర్ ఇవ్వలేదన్నారు. పత్రికలు, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన సమాచారం చూసి ఈపీఎఫ్ ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌లోని ఉద్యోగుల 11.3 సమస్య పరిష్కారానికి కృషి చేశామని త్వరలో వారందరికీ డిమాండ్ లెటర్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ పీఎఫ్ మాజీ ట్రస్టీ జగదీశ్వరరావు, సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, బీఎంఎస్ నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, ఎం.వి.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్సిల్ ముల్లుపై '2024'



పెన్సిల్ ముల్లుపై 2024ను చెక్కి, నూతన సంవత్సరానికి వినూత్నంగా స్వాగతం పలుకుతున్నాడు 74వ వార్డు సిద్ధేశ్వరానికి చెందిన ద్వారపూడి మధు. డిగ్రీ పూర్తి చేసిన మధు, గతంలో చాక్‌పీస్‌లతో పలు కళాఖండాలను చెక్కారు. ఈయన తండ్రి కార్పెంటర్ కావడంతో ఖాళీ సమయంలో ఆ పరికరాలతో ఇటువంటి కళాకృతులు చేస్తుంటానని తెలియజేశారు.

– పెదగంట్యాడ

ఘనంగా డీపీఎస్ వార్షిక క్రీడా దినోత్సవం



గాలిలోకి బెలూన్లు వదులుతున్న అతిథి, ప్రిన్సిపాల్

ఉక్కునగరం: స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షిక క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రో వైస్ చైర్మన్ ఎస్.వి.ఎస్.రాజు క్రీడా జ్యోతిని అందజేశారు. గాలిలోకి బెలూన్లు వదిలారు. విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సమీర్ కుమార్ పాండే వార్షిక నివేదికను అందజేశారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠగా గ్యాస్ లెవెల్ మాక్ డ్రిల్



పరిస్థితిని అదుపులోకి తెస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

ఉక్కునగరం: భద్రతా చర్యల సంసిద్ధతలో భాగంగా స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన మాక్ డ్రిల్ ఉత్కంఠగా సాగింది. స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలోని బెంజాల్ ప్లాంట్‌లో బీటీ 409 నాన్ ఆరోమాటిక్స్ ట్యాంక్ సేఫ్టీ వాల్వ్ ఫ్లెంజ్ తెరిచేటప్పుడు అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై సీఐఎస్ఎఫ్ ఫైర్ సిబ్బంది సహకారంతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్‌ను రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె. శివశంకర రెడ్డి తిలకించారు. సీజీఎంలు యు.శ్రీధర్, జీఎం ఉత్తమ్ బ్రహ్మ, పలువురు విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా..

ప్రత్యేక అధికారుల నియామకం

సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుకి చేరేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. నవరత్నాల సంక్షేమ ఫలాలు అందరికీ అందేందుకు మండలాల వారీగా పర్యవేక్షణ అవసరమని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణకు 11 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల పరిధిలో ఉన్న సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛను కానుక, చేయూత, ఆసరా తదితర కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సచివాలయ సిబ్బందితో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విధానాలు తెలపాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రత్యేకాధికారులు వీరే...

మండలం	ప్రత్యేకాధికారి	హోదా
పద్మనాభం	జి. సూర్యప్రకాశరావు	జిల్లా పౌర సరఫరాల అధికారి
భీమునిపట్నం	ఎస్. భాస్కరరెడ్డి	ఆర్డీవో, భీమిలి
ఆనందపురం	టి. సీతారామ్మూర్తి	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
విశాఖపట్నం రూరల్	జీవీఎస్ఎస్ రామమోహన్‌రావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
సీతమ్మధార	చక్రవర్తి	డీపీవో, జీవీఎంసీ
మహారాణిపేట	చంద్రిక	డీపీవో, జీవీఎంసీ
గోపాలపట్నం	పి. శేషశైలజ	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
ములగాడ	టి. ప్రవీణ	జిల్లా కో–ఆపరేటివ్ అధికారి
గాజువాక	డి. లక్ష్మారెడ్డి	ఎస్టేట్ అధికారి, వీఎంఆర్డీఏ
పెదగంట్యాడ	డాక్టర్ వి.సన్యాసిరావు	అదనపు కమిషనర్, జీవీఎంసీ

యుద్ధ ప్రాతిపదికన పైపులైను మరమ్మతులు



నాతయ్యపాలెం పంప్ హౌస్ వద్ద మంచినీటి పైపునకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: పగిలిన మంచినీటి పైపు లైనుకు నీటి సరఫరా విభాగం సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. నీటి సరఫరా విభాగం ఏఈ మనోహర్ తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 66, 67, 68 వార్డులకు షీలానగర్ ఫిల్టరేజ్ ట్యాంక్ నుంచి నాతయ్యపాలెం పంప్ హౌస్‌కు సరఫరా అయ్యే 400 ఏసీ పైపు లైను నాతయ్యపాలెం పంప్ హౌస్ వద్ద పగిలిపోవడంతో ఆయా ప్రాంతాల్లో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే సమస్యను గుర్తించిన నీటి సరఫరా విభాగం అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ గుడియా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పైప్ లైన్ మరమ్మతులు చేపట్టారు. శనివారం యథావిధిగా మంచినీటి సరఫరా జరుగుతుందన్నారు.

చీపురు పట్టి.. చెత్త ఎత్తి

పారిశుధ్య నిర్వహణ పనుల్లో గాజువాక ఏఎంవోహెచ్



రోడ్డు ఊడ్చుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

గాజువాక : గాజువాక జోన్‌లో చెత్తను ఎత్తడానికి స్వయంగా సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. ఆయనే చీపురు పట్టి పలుచోట్ల చెత్త ఎత్తారు. దీంతో విభాగంలోని మిగిలిన సిబ్బంది కూడా పారిశుధ్య నిర్వహణ పనుల్లో భాగస్వాములయ్యారు. పారిశుధ్య కార్మికులు మూడు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంతో రోడ్లపై చెత్తలు కుప్పలుగా పేరుకుపోయాయి. వాటిని తరలించడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినా, సిబ్బంది చాలకపోవడంతో అధికారులు కూడా చెత్త తరలింపు పనుల్లో నిమగ్నమయ్యారు.

కూత కుదిరింది.. ఆట అదిరింది

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



ఇస్లాంపేట పాఠశాల మైదానంలో హోరాహోరీగా కబడ్డీ ఆడుతున్న బాలికలు



ఆదర్శగ్రౌండ్‌లో బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

పెదగంట్యాడ: ప్రతిభ ఉన్న క్రీడాకారులకు మరింత పదును పెట్టేందుకు, మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు గాను రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో, ఇండోర్ స్టేడియంలో, ఆదర్శ గ్రౌండ్‌లో, ఇస్లాంపేట పాఠశాల మైదానం, గంగవరం పాఠశాల మైదానంలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన లభించింది. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఖోఖో, క్రికెట్, వాలీబాల్ పోటీలు.. ఆదర్శగ్రౌండ్‌లో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇస్లాంపేట పాఠశాల మైదానంలో కబడ్డీ పోటీలు, ఇండోర్ స్టేడియంలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. పెదగంట్యాడ మండల పరిధిలో నిర్వహించిన పలు పోటీల్లో 49 జట్లు పాల్గొన్నాయని జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు.

సౌత్ ఇండియా పోటీలకు 'కూల్ హెల్మెట్'



ప్రశంసా పత్రం అందుకుంటున్న రాజారావు

విశాఖ విద్య: జిల్లాలోని గంగవరం జెడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు పాలగుమ్మి రాజారావు రూపొందించిన కూల్ హెల్మెట్ ప్రాజెక్టు ప్రదర్శన ద్వారా రాష్ట్ర స్థాయిలో అధికారుల ప్రశంసలందుకున్నారు. కడపలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన రాజారావు మాస్టారు, తాను తయారు చేసిన కూల్ హెల్మెట్ ప్రాజెక్టును ప్రదర్శించారు. 26 జిల్లాల నుంచి టీచర్ కేటగిరీలో పది మంది ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనగా, వీరిలో రాజారావు రూపొందించిన ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుంది. త్వరలో జరగనున్న సౌత్ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికైన రాజారావుకు జిల్లా విద్యాశాఖాధికారులు, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఒకటో తేదీ నుంచి ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



అక్షింతలను వృద్ధి చేస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను జనవరి ఒకటో తేదీ నుంచి గాజువాకలో ఇంటింటికీ పంచిపెట్టనున్నట్టు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను పాతకర్ణవానిపాలెంలోని రామాలయంలో శుక్రవారం వృద్ధి చేశారు. ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనవరి 22న విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారన్నారు. ఈ నేపథ్యంలో రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలు, ఆహ్వాన పత్రం, శ్రీరాముని చిత్రపటం ప్రతి ఇంటికీ వెళ్లి అందజేస్తామన్నారు. సలాది వెంకట రమణ, టి.సోమశేఖర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడిలో అక్షింతల ఊరేగింపు

అగనంపూడి: అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను అగనంపూడిలోని శాంతినగర్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఊరేగించారు. 85వ వార్డు దానబోయినపాలెంకు చెందిన రామాలయ కమిటీ ప్రతినిధి ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో కోలాట బృందాలు శ్రీరాముడి సంకీర్తనలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి దానబోయినపాలెంలోని రామాలయంలో భద్రపరిచారు. కనకభవానీ,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఎండీ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీఎండీ అతుల్ భట్ శుక్రవారం ఆవిష్కరించారు. ఉక్కు పరిపాలన భవనంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో లైజన్ ఆఫీసర్ తిరుపతిరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొడన్న, బయ్యే మల్లయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- ఉక్కు అధికారుల సంఘం (సీ) 2024 క్యాలెండర్‌ను సీఎండీ అతుల్ భట్ ఆవిష్కరించారు. సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, సంయుక్త కార్యదర్శి నరసింహ, సభ్యులు పాల్గొన్నారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం



విద్యార్థులకు శుభ్రత గురించి వివరిస్తున్న మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు సూచించారు. అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో డ్రై డే గురించి తెలియజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వివరించారు. హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, హెల్త్ అసిస్టెంట్లు అప్పలరాజు, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.